# తెలుగులో కథలు వ్రాసేవారు

రచయిత :
సత్యసాధకుడు

[తెలుగులో కథలువ్రాసేవారు అను శీర్షికతో ఫిబ్రవరిమాసపు ఆంధ్రభూమి సంచికలో కృత్తివాసతీర్థులు అనువారు వ్రాసిన వ్యాసమునకిది జబాబు.]

కృత్తివాసతీర్థులుగారూ! మీవ్యాసము ఫిబ్రవరి "ఆంధ్రభూమి"లో మొదటిసారి మామూలుగాను, రెండవతూరి జవాబువ్రాయవలెనను ఉద్దేశముతోను చదివినాను. మీ విమర్శ, మీపేరుకూడా నాకు చిత్రముగానే కనిపించినవి. మీరు ఇంగ్లీషులో ఉన్న తర్జుమాలు బాల్‌జక్, డాస్టావెస్కి, గ్రాజియా డెలిడ్డా, మాగ్సిమ్‌గోర్కి, మొపాసా, టాల్‌స్టాయి మొదలైన సుప్రసిద్ధరచయితలకథలు చదివే వుంటారని తలుస్తాను. కథ అక్కడనే పైవారిమధ్య పుట్టినది. మీరు వారిపుస్తకాలు చదివి ఉండకపోయినా సరే, చదివినను కథ ఎట్లుండవలెనో బోధపడక పోయిన కర్మము. అది అట్లుండనిండు.

విగతవస్త్రయై నాట్యముచేయగా జోహారు.

"కథలో వెర్రిగా ప్రబంధాలను మించిపోయిన పచ్చిశృంగారం అసభ్యతతో, అనాచితితో ఉంటూవున్నది" అని వ్రాశారు. తమరు ఎన్ని ప్రబంధాలు చదివినారు, దేనిలో ఈ "పచ్చిశృంగారం" మీకుశాగ్రబుద్ధికి కనిపించినది? ఓ, తమదృష్టిలో ప్రబంధములు "పచ్చిశృంగారము" తో నిండియున్నవా! సంతోషమే దయచేసి మీరు ఎక్కడైనా దొరికితే, లేక సంపాదించి అయినా, "మై లైఫ్' బై ఇసాడోరా డన్‌కన్ అను పుస్తకముచదవండి. ఈమె (ఇసాడోరా) యూరపులోను, అమెరికాలోను విగతవస్త్రయై నాట్యముచేయగా మొదటలో మీవంటివారు చాలా అసహ్యించుకొని కళ్లుమూసికొన్నారట. కాని తర్వాత, తర్వాత మతము వేదాంతము మొదలైనవస్తువులు ఆధారముచేసికొని ఆమె నృత్యముసల్పునపుడు గొప్పగొప్ప కవులు, వేదాంతులు సయితము తన్మయానందముపొంది ఆమెకు జోహారులొసంగినారు.

మీరు గ్రీకు, రోమను సుప్రసిద్ధ విగ్రహాలు, అజంతా యెల్లోరా చిత్రాలు గమనించలేదా; ఇదంతా "పచ్చిశృంగార"మేనా మీదృష్టిలో.

లేక ప్రబంధాలను దూషించుట భావకవులరీతి మీకుకూడా "ఫాషను" అయినదా?

ఏమైనా, శృంగారము, "పచ్చిశృంగారము"లకు తేడా తెలుసుకొని మరీ, విమర్శలు వ్రాయబూనుట మంచిది మీరు.

చింతా దీక్షితులుగారికి
కథాప్రపంచములో ఎట్టిస్థానమును లేదు.

దీక్షితులు : తర్వాత చింతా దీక్షితులు

గారు "ఉత్తమశ్రేణికి చెందినవారు" అని వ్రాసినారు. ఎట్లుచెందెదరో నాకు బోధపడ లేదు. నాదృష్టిలో ఆయన పిల్లలకు పుస్తక ములు వ్రాయుటకు, పాఠములు చెప్పుటకు తప్ప మరెందుకు పనికిరారనీ, అప్పుడప్పుడు ఏ హరినాధబాబా జీవితమో, "పరివర్తన ము"మీద పుస్తకమో వ్రాయుటకు మాత్ర ము అర్హులనీ ఎంచెదను. ఈమధ్య జ్వాలలో నీలకంఠంకథలు వ్రాసిన శంకరశాస్త్రిగారు వారి "అన్నగారు" అయిన దీక్షితులుగారిని "కథకచక్రవర్తి" అని పొగడుకొనుటలో కొంత అర్థమున్నది. మీరు తెలుగుకథలను విమర్శచేయ దలంచుకొని ఆయన కంతస్థాన మిచ్చుట—ఏమనవలెనో ! లేక మీరు శాస్త్రిగారికిగాని దీక్షితమహాశయునకుగాని బందుగులా? అదీ, ఇదీ కాకపోతే "గొడ్డు లేనివూళ్లో గొడ్డుగేదె మహాలక్ష్మి" అంటా రా ? మనవారికి ఒకరినొకరు పొగడుకొనుట బాగా అలవాటులాగు కనిపించుచున్నది. ఏమైనను దీక్షితులుగారికి కథాప్రపంచములో ఎట్టిస్థానమును లేదని నాదృఢమైన నమ్మిక.

మొక్కపాటి : ఈయన "బారిష్టరు" చక్కని గ్రంథము. వీరిరచనలన్నియు మొత్తముమీద మెఱుపులవంటి భావములు కలిగి ఉంటవి. ఇంగ్లీషులో జరోమి, వుడ్ హౌస్, జాకబ్సును వీరి రచనలు తలపిస్తూ ఉంటవి.

వెంకటచలంగారి కథలు దొంగరకం ఫొటో కథలు.

వెంకటచలం : ఈయన "వకీలు" అని మీరు తప్పు అభిప్రాయములో ఉన్నారు. వెంకటచలంగారు బడిపంతులు. అయినను ఈయన ఎడ్యుకేషనల్ రూల్సుకు వ్యతిరేక ముగా గవర్నమెంటు అనుమతిలేకుండా "అసభ్యమైన" పుస్తకాలు వ్రాస్తున్నారు. ఈయన రచనలు మేలుకంటె హాని ఎక్కువ చేస్తున్నవి సంఘానికి. ఇటువంటివారంతా "సంఘం మరమ్మతుకోసం" పుస్తకాలు వ్రాయుచున్నారు అంటే అంతకన్నా తెలివి తక్కువ మాట ఉండదు. ఈయన "శశిరేఖ" చచ్చు పుస్తకము ; మీకు గుణా అవగుణ ములు బాగా తెలియవలెనంటే రోమెన్ రోలెండుగారి ఎంఛాంటెడ్ సోల్ చదివితే సద్గ్రంథమునకును, నీచపు "శశిరేఖ"కును తేడా తెలియకలదు. ఎంఛాంటెడ్ సోల్ ఎందుకు పోల్చినానంటే "శశిరేఖ"తో కొన్ని విషయాలలో బాహ్యదృష్టికి పోల్చతగిన 'ఎన్నిట్టి' అనేవ్యక్తిని రోలెండు సృష్టించి యున్నాడు కనుక. వెంకటచలంగారికథలు మొపాసా కథలకు అనుకరణాలు, దొంగరకం "ఫోటో" కథలు. ఈయన "దైవమిచ్చిన భార్య" పేరుకూడా ఈయనసొంతముకాదు, సర్ హాల్ కెయిన్ గారి "ది ఉమన్ దౌగే వెస్టు మి" అనేపేరుకు తెనుగు. ఆపుస్తకము లోని వస్తువు హెచ్. జి. వెల్సుగారి ఫాష నేట్ ఫ్రెండ్సు లోనిది.

ఈనడుమ నేను డి. హెచ్. లారెన్సు అనే వెంకటచలంగారివంటి ఇంగ్లీషురచయిత పుస్త కమొకటి చదువుచుండ అందు "ఆమె ఇంటి చుట్టు అతడు 'ఆడకుక్క వెంట మగకుక్క వలె' ఆత్రముతో తిరుగుచున్నాడు" అని ఉంది. అయితే, అటువంటి చచ్చువ్రాతలు వ్రాయుటచేతనే లారెన్సును ఇంగ్లండునుండి తరిమివేశారు. కాని వెంకటచలంగారిని తరిమే వారు ఏరి? లోకమంతటిలో గొప్పవాడు అను కుంటూవున్న బెర్నార్డుషా (ఏకపత్నీవ్రతుడు, శాఖాహారి) వంటివాడు మాన్ అండ్ సూపర్ మాన్ వ్రాశాడు అంటే వెంకటచలం గారివంటి "నీతి"లేని మనిషి పుస్తకాలు

స్తున్నాడంటేను తేడాలేదూ! ఏదో వెంకటచలంగారు ఇంద్రుడని చంద్రుడని పొగిడే దానికంటే వారి కథలు, పుస్తకాలు కొంచెంగా పరీక్షచేస్తే గుట్టుకాస్త బయట పడుతుంది.

మునిమాణిక్యం: ఈయన కథలు సాంసారిక కథలు: ముచ్చటగా ఉన్నమాట నిజమే కాని, స్వీయచరిత్ర ఎక్కువగా నింపివేస్తున్నాడేమో అని భయము వేస్తూవుంటుంది.

శ్రీపాదవారికి ఇంగ్లీషువచ్చిఉన్నట్లయితే.

శ్రీపాద: ఈయనకు మీరేదో బోధచేయ ప్రయత్నించినారు కాని, ఆబోధ అంత కారణ యుక్తముగాను, ఉండవలసినరీతిగాను లేదు. వీరి మురిపెముగూర్చు కథలలోని గొప్పతనం ముందుముందుతరాలువారు బాగా గ్రహించగలరేమో అని ఆశ. ఇంగ్లీషురాని లోపము వీరికథలలో కనిపించేమాట నిజమేకాని, శ్రీపాదవారికి ఇంగ్లీషువచ్చిఉన్నట్లయితే, అసలు పాడవునేమో అనికూడా భయము కలుగుతూ ఉంటుంది. వీరి "చతురంగం" కథ మొదలైనవి కథ ఎట్లుండవలెనో అచ్చముగా అట్లున్నవి.

శివరామశాస్త్రి: వీరి రచనలు సెలయేళ్ళవలె స్వచ్ఛముగా మందగమనముతో నడుస్తవి. ఆత్మశుద్ధి ఈయన వ్రాతలలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. కథాలోకము ఈయనకెట్టి స్థానము లభించునో ఇప్పుడప్పుడే చెప్పుట కష్టమైన పని.

అయితే చక్కనికథలువ్రాసే కొడవకంటి వారినిగూర్చి మీరు వదిలివేశినారేమి?

ఏమైనను వాఙ్మయములో మనవారు ఎంతవరకు అభివృద్ధి పొందినారు? మనము ఇంగ్లీషువారు వాఙ్మయవిషయమున విక్టోరియన్ యేజ్‌లో ఉన్నట్లయినా ఉన్నామా' లేక ఏజ్ ఆఫ్ రొమాంటిసిజమ్‌లో వున్నటులకూడా లేమా! అని భయము వేస్తూవుంటుంది. పోనీ మనబెంగాలీ సోదరులు ఇప్పుడున్న స్థితిలోనైనా ఉన్నామా! మన పెద్దమనుష్యులకు అహంభావము ఎక్కువ, అదీ, శక్తీ, లేకపోతే ఈర్ష్య—మనము ఎంత వెనుకబడివున్నదీ మనకు తెలియదూ!

నీలకంఠం కథలు

'పొరుగింటిఆవిడమీది చూపుతూపులు'

ఏది, ఒక్క వజ్రపుతునుకవంటి స్వతంత్ర గ్రంథము—ఒక డేవిడ్ కాపర్‌ఫీల్డు వంటి ఉత్తమగ్రంథము—మనలో ఈనడుమ పుట్టినది? శంకరశాస్త్రిగారివంటివారు ఆశరత్తుబాబునుండి తర్జుమాలు చేయకపోతే స్వతంత్రంగా వ్రాయ ప్రయత్నించకూడదూ! అవునవును—ప్రయత్నం చేయకచేయకచేస్తే నీలకంఠంకథలువంటివి పొరుగింటి ఆవిడమీది చూపుతూపులతో బయలుదేరుతవి. వెంకటపార్వతీశ్వరకవులున్నారు. ఇంక ఎందరో వున్నారు — కాని ఏమిప్రయోజనము—ఏది ఒక్క స్వతంత్రగ్రంథము—అయితే ఏచాటునో మాటునో ఉండి, బురదలోనుండి వచ్చిన తామరపువ్వులాగు, మబ్బులలోనుండి కొండల చాటున మెరిసే చందమామలాగు వెలసిన "మాలపల్లె"—ఉన్నవ లక్ష్మీనారాయణగారు ధన్యులు. ఇంకా విశ్వనాథ, వేదుల, చిలకమర్తి, పానుగంటి, బసవరాజు, నండూరి మొదలైన కవులు, రచయితలు మనలో లేక పోలేదు.

అయితే ఇతర భాషలోకి తర్జుమాచేయుటకు అర్హతగల పుస్తకం మనలో ఒక్కటి మచ్చుకైనా ఉందీ?

ఇంకెపుడు తెనుగువారికి ముక్తి!